# సుఖపడేదెప్పుడు?

కాకాని కమల

అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటుతోంది. ఊరంతా ఆదమరిచి నిద్రపోతూంది. బయటంతా చీకటి ఆవరించింది.

కాని ఆ గదిలో మాత్రం సన్నసన్నని నవ్వులూ, బిరబిరా మువ్వల శబ్దాలూ వినిపిస్తూన్నాయి. గదంతా పల్చని నీలికాంతి పరుచుకుంది. మల్లెలు సంపెంగలు కలిగిన మత్తైన పరిమళం నిండింది.

ఆ గదిలో విశాలమైన తెల్లని మెత్తని పడక మీద పల్చని దోమతెర కింద మోహిని అలవోకగా దిండుకానుకుని వుంది. ఆమె దుస్తులు ధరించిందో లేదో ఆమెకే తెలియని ఒక ఉన్మాద స్థితి.

మహేందర్ తన రెండు చేతుల మధ్య ఆమె చెక్కిళ్ళు అదిమాడు.

"మోహినీ... నువ్వు జ్ఞాపకం వస్తే నాకు నిద్రపట్టదు. తిండి సయించదు. నువ్వంటే నాకు పిచ్చి. నీ ఒడిలో చచ్చిపోదామనిపిస్తుంది. ఎంత కోర్కె!" సన్నని గుండ్రని ఆమె భుజాలని తన పెదవులతో గాఢంగా రుద్దుతూ అన్నాడు మహేందర్. మోహిని నవ్వింది.

అతని చెంపల్ని తన మునివేళ్లతో సుతారంగా రాస్తూ,

"నీ పరిచయమే లేకపోతే నా బతుక్కి అర్థమేలేదు మహి. మోడులా పడి వుండే దాన్ని. బతుకులో తీపిరాసి చూపించింది నీ స్నేహమే" అంది అతని బలమైన చేతుల మధ్య నలుగుతూ తన్మయంగా తన రెండు చేతుల్ని అతని మెడచుట్టూ వేసింది.

ఆ రేయి...స్త్రీ పురుషుల కలయికకి అర్థం అనిపించేలా వుంది ఆ గదిలో.. ప్రకృతి కాంత పులకిస్తున్నట్టు బయట ఆకాశం ఉరిమింది. సన్నగా చినుకు మొదలైంది. చలి... చలికి తోడు వెచ్చని అతని స్పర్శ మోహినిని ఆనందపుటంచులికి చేరుస్తున్నాయి... కథ చదువుతున్న అరుణ ఆవేశంగా చేతిలోని వారపత్రిక పక్కకి విసిరికొట్టింది. ఉద్వేగంతో ఆమె ముఖంలోని నరాలన్ని ఉబ్బినట్టు అయ్యాయి. అరుణ ఒళ్ళంతా కోర్కెతో వేడెక్కిపోయింది. ఆ కథలోని మోహిని మహేందర్‌లని తల్చుకుంటే ఆమె ఒళ్ళంతా వేడెక్కుతోంది. ఏదో అనుభూతి కోసం ఉవ్విళ్ళూర సాగింది. తీరని కోర్కెలేవో ఆమెని కుదపసాగాయ్. ఏదో ఆరని జ్వాల రగులుతున్నట్టు శరీరమంతా అలజడి...

అశాంతిగా మంచం దిగి కిటికి దగ్గరకి వచ్చి రెక్కలు తెరిచి బయటికి చూసింది అరుణ.

రాత్రి పది కావస్తోంది. రోడ్డు నిర్మానుష్యం అవుతున్నది.

భర్త వచ్చే జాడలేదు. అంత తొందరగా ఇంటికి రాడు కూడా. అరుణ భర్త విశ్వనాథం ఇంటికి రావాలంటే అర్థరాత్రి దాటాలి. లేదా తెల్లవారాలి. నిన్న మొన్నటిదాకా క్లబ్బే కాపురం. తాగుడూ, పేకాట వ్యసనాలు. ఈ మధ్య ఎవరో అమ్మాయితో స్నేహం అయ్యిందిట. ఇప్పుడు మకాం అక్కడే. పూర్తిగా ఇల్లు మర్చిపోయాడు.

అరుణకి పెళ్ళయి మూడేళ్ళు దాటుతోంది. ఇంకా పిల్లలు లేరు. అదీ ఒకందుకు మంచిదే అనుకుంటుంది. పెళ్ళయిన కొత్తలో కూడా విశ్వనాథం తిన్నగా ఇంటిపట్టున వున్నది లేదు. పెళ్ళాన్ని మురిపాలతో ముంచెత్తింది లేదు. పెళ్ళినాటికే అతనికి పుట్టెడు వ్యసనాలున్నాయి. ఆ పరిస్థితిలో కొడుక్కి పెళ్ళి అయ్యిందే చాలనుకున్నారు అతని తల్లిదండ్రులు. కూతురికి పెళ్ళి అయ్యిందే చాలనుకున్నాడు అరుణ తండ్రి. అరుణని అడిగిందెవరు? ఆంధ్రదేశంలో ఆడపిల్లలకి ఇష్టాలుండకూడదా. ఆలోచన్లు ఆపి సగం చదివి కింద గిరాటేసిన కథల పుస్తకం తిరిగి చేతుల్లోకి తీసుకుంది అరుణ.

'వెన్నెలవేడి' కథలోని మోహిని మహేందర్ కళ్ళముందే ప్రాణం పోసుకుని కదులుతున్నారు.

మోహిని భర్త చిన్న వయసులోనే చనిపోతే, భర్త స్నేహితుడు మహేందర్ పంచన చేరుతుంది. అతనికి పెళ్ళి అయ్యింది. ఇద్దరు పిల్లలున్నారు. అయినా మోహినితో వేరే ఇల్లు పెడతాడు. మోహినికి ఉద్యోగం వుంది.

'స్త్రీ అయితే మాత్రం ఆకలీ నిద్రా వుండవా? భర్తపోతే ఒంటరిగా బతకాలా? ఆకలేస్తే అన్నం తినటం లేదా. పస్తువుంటున్నామా? సమయానికి లేకపోతే పక్కింటి నుంచి అప్పు తెచ్చుకొని అయినా లేదా దొంగతనం చేసి అయినా తింటున్నాం కదా. ఇదీ అంతే' అంటు మహేందర్ మోహినికి చెప్తాడు కథలో.

కాని ఆ మాటలు పరోక్షంగా తనకే చెవుతున్నాడా అనిపించింది అరుణకి.

కథ చదువుతున్నంత సేపూ ఆమె మోహినిగా మారిపోయింది.

కథలో మోహినికి భర్త చనిపోయాడు. అరుణకి బతికే వున్నాడు. అదీ తేడా. మోహినికి మహేందర్ స్నేహం లభించింది.

'మరి తనకి?' మునివేళ్లతో నొసలు రుద్దుకొంది అరుణ.


ఆలోచిస్తూ వాళ్ళ కిటికి దగ్గరకి వచ్చి ఎదురింటి మేడకేసి చూసింది.

మేడ మీది గదిలో లైటు వెలుగుతూంది. గుమ్మానికి తెర కదులుతూంది.

ఆ గదిలో వుండే రాజేష్ సి.ఎ. చేస్తున్నాడు. సందు చివర మెస్సులో తింటాడు. అరుణ కనిపిస్తే చాలు ఆకలిగా చూస్తాడు. కొరుక్కుతినేసేలా చూస్తాడు. మొహమాటం అసలే లేదు. పిట్టగోడకి ఆనుకుని మరీ అరుణ ఇంటికేసి అలా గంటల తరబడి చూస్తాడు. కళ్ళతోనే ఏవేవో సందేశాలు పంపిస్తాడు. అరుణ ఒంటరితనం అతను పసిగట్టాడు. అందుకే ఎంతో సానుభూతి కనపరుస్తూ ఆమె పరిచయం కోసం తహతహ పడుతున్నాడు.

అంతా గ్రహిస్తూనే వుంది అరుణ.

ఇంతవరకూ అరుణ, రాజేష్‌లు ఎదురుపడి మాట్లాడుకోలేదు. కాని అతని మనోభావాలు అరుణకి అర్థం అవుతున్నాయి. తనని ప్రేమించే మగవాడు రహస్యంగా ఆరాధించే మగవాడు వున్నాడనుకుంటే ఆనందం వేస్తుంది అరుణకి. రాజేష్ కళ్ళల్లో కదిలే ఆశ అనురాగం గుర్తుకి వస్తే అరుణకి నిద్రరాని రాత్రులు ఎన్నో...



పరువు, ప్రతిష్ఠ ఎందుకొచ్చినవి?

అతని ఒళ్ళో వాలిపోదామనిపిస్తుంది అరుణకి. అతని గాఢపరిష్వంగనలో కరిగిపోదామనిపిస్తుంది అరుణకి.

'ఆడదైనంత మాత్రాన కోర్కెలు చంపుకోవాలా?' కథలో మహేందర్ ఎంతబాగా చెప్పాడు.

'వెన్నెల వేడి' కథలో మహేదర్ మోహిన్ని ప్రేమించినట్టే ఎదురింటి మేడమీది రాజేష్ తనని కోరుకుంటున్నాడు.

తనకేసి ఎంత ఆరాధనగా చూస్తాడు.

ఆ చూపులో ఎన్ని అర్థాలు?

జవాబుగా తను చిరునవ్వు నవ్వితే చాలు పొంగిపోతాడు. అలా గంటలు గంటలు పిట్ట గోడ దగ్గర నిలబడి తనకోసం నిరీక్షిస్తాడు. తన భర్త విశ్వనాధంకి తనపై మోజులేకపోవచ్చు. ప్రేమలేక పోవచ్చు.

కాని తనని ప్రేమించేవాళ్ళు తనంటే మోజుపడేవాళ్ళు తనకి ఉన్నారు. తను సుఖపడితే తప్పేమిటి? బతుకంతా తీరని కోర్కెలతో ఎందుకుండిపోవాలి? తన భర్త అతని ఆనందం అతను చూసుకుంటున్నప్పుడు తన ఆనందం తను చూసుకోకూడదా?

ఆకలేస్తే అన్నం తినటంలేదా? వస్తు వడుకుంటున్నామా? ఇది అంతే.

'వెన్నెల వేడి' కథలో మహేందర్ మోహినికి ఎంత బాగా జీవితం గురించి చెప్పాడు.

తను చిరునవ్వు నవ్వితే పొంగిపోతాడు రాజేష్. ఇంక అతన్ని కోరుకొంటే అతని ప్రేమని అంగీకరిస్తే ఎంత ఆనందపడిపోతాడో!

తన భర్త అతడి సుఖం అతను చూసుకుంటున్నప్పుడు తన సుఖం తను చూసుకుంటే తప్పేమిటి? అతడు తన గురించి ఆలోచించనప్పడు, తన భర్త గురించి తనెందుకు ఆలోచించాలి?

అరుణ మనసంతా మైకం కమ్మినట్టు అయ్యింది. ఏదో శక్తి ఆవహించినట్టు ఇంట్లోంచి బయటికి వచ్చింది. ఉన్మాదినిలా ఎదురింటి గేటు తెరిచి మేడమెట్లు ఎక్కసాగింది.

ఆమెలో అంత ఆవేశం తెగింపు ఎలా వచ్చిందో ఆమెకే తెలియదు. బహుశా అప్పడే చదివిన 'వెన్నెల వేడి' కథ తెచ్చిన అనుభూతి ఉద్దీపం కావచ్చు. ఆ కథలోని మోహిని లాంటి అనుభవం తనకి కావాలి. రగిలే కోర్కెల్ని ఎంతకని చల్లార్చగలదా? అసలు ఎందుకు చల్లార్చాలి? ఏదో స్థిరత్వం మొండిగా అరుణలో వచ్చి చేరాయి.

మరో ఆలోచన లేకుండా వేగంగా మెట్లెక్కి రాజేష్ గది ముందుకు వచ్చింది. కోర్కెలతో రగులుతూ ఏదో మధురానుభూతి కోసం వెంపర్లాడుతూ తెర తొలగించి ఓరవాకిలిగా వున్న తలువులు తోసుకుని రాజేష్ గదిలోకి దూకుడుగా అడుగెట్టబోయింది.

కాని అప్రయత్నంగా కాలికి సంకెళ్ళు పడినట్టు ఎవరో బలంగా జబ్బపట్టి వెనక్కి లాగినట్టు గడప ఇవతలే వుండిపోయింది.

గదిలోపల్నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

గదిలోపల రాజేష్ ఒక్కడే కాదు అతని స్నేహితుడు కూడా ఎవరో వున్నట్టుంది. ఆ స్నేహితుడు అంటున్నాడు.

"ఏవిటోరా రాజేష్. బోల్డంత కట్నం ఇచ్చి ఒక్కర్తే ఆడపిల్ల అని మా చెల్లికి పెళ్ళి చేశాం. ఇంకా ఆ అప్ప తీరనే లేదు. అది భర్తతో తగాదా పడి పుట్టింటికి వచ్చేసింది. ఇంక వెళ్ళను అంటోంది. అతనికేవో చెడు అలవాట్లు వున్నాయి అంటోంది. భర్తకి విడాకులు ఇచ్చి తన బతుకు తను బతుకుతాను



## కొత్త కుర్రాడి చెయ్యి విరిచిన ఊర్మిళ.

'మస్త్' అనే సినిమాని రామ్‌గోపాల్‌వర్మ ఊర్మిళతోనూ కొత్తకుర్రాడు ఆఫ్తాబ్‌తోనూ తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ సినిమాలో ఒక సీను కోసం ఊర్మిళని పడుకోబెట్టి చేతుల్తో ఎత్తాల్సిన అవసరం వడేసరికి ఆఫ్తాబ్ ఎగరేసుకుంటూ రెడీ అయిపోయాడు. కానీ ఊర్మిళలో తగలరాని చోట తగలకూడదనే షరతు పెట్టేసరికి పాపం ఆఫ్తాబ్ సరదా నీరుకారిపోయిందట. తీరా ఎత్తాల్సిన విషయానికొస్తే షాట్ ఓకె గానీ ఆఫ్తాబ్ మణికట్టు కాస్తా విరిగి కూర్చుందట.

అంటోంది. మా చెల్లి అసలే పెంకిది. మా అమ్మ అతిగారాబం చేసి దాన్ని పాడుచేసిందిరా. ఏం చెయ్యాలో తోచడంలేదు. ఇంటి పరువు రచ్చకి వచ్చేలా వుంది. ఏదన్నా ఉపాయం చెప్పరా రాజేష్" బ్రతిమాలుతున్నట్టు అంటున్నాడు అవతలి వ్యక్తి.

రాజేష్ అంటున్నాడు మిత్రుడితో–

"ఒరేయ్ కుమార్ అనవసరంగా దిగులు పడకురా. మీ చెల్లెలు ఉష నాకు బాగా తెలుసు. రేపు నేను వచ్చి మాట్లాడతాను. భర్త అలవాట్లు నచ్చకపోయినా, భర్త వ్యసనపరుడు అయినా ఓర్పుగా తెలివితేటల్తో అతణ్ణి మార్చుకోవాలి. సంసారం చక్కగా చేసుకోవాలి. అంతేగాని భర్తని ఒదిలి వీధికి ఎక్కకూడదు ఆడది. అలాంటి తెగించిన ఆలోచన్లు మనలాంటి అయినింటి ఆడాళ్ళకి వుండకూడదు. అలాంటి ఆడవాళ్ళని తెగించిన రకాలు అంటారు. సిగ్గు విడిచిన ఆడదానికి సమాజంలో విలువ లేదురా. ఆ విషయం ఉషకి తెలియక తొందర పడుతూంది. ఇంకా చిన్నతనం కదా. నే వచ్చి నచ్చచెవుతాలే. ఓర్పు, సహనంతో భర్తని తనదారికి తెచ్చుకోవాలిగాని తాళికట్టిన వాడ్ని కాదని రోడ్డున పడితే ఎంగిలి విస్తరాకులో తినే కుక్కకీ, ఆడదానికి తేడా వుండదురా. ఆడది ఎప్పుడైనా హద్దులో వుంటేనే అందం. ఉషకి నేను నచ్చచెవుతాలే. భర్త దగ్గరకి పంపే పూచి నాది. సరేనా" ఓదారుస్తున్నాడు రాజేష్.

'నీ చెల్లెలు నాకు చెల్లెలు లాంటిదే' అంటున్నాడు.

తలుపు చాటున పరదా పక్కన నిల్చున్న అరుణకి నెత్తిమీద చల్లని నీళ్ళకుండ గుమ్మరించినట్టు అయ్యింది. హిమశిఖరం మీంచి అగాధంలోకి తోసి వేయబడ్డట్టు ఏదో బాధ.

తనని కోర్కెతో తినేసేలా చూసే రాజేష్, తన ఒళ్ళంతా చూపులతోనే తడిపేసే రాజేష్, తను పరాయి వాడి భార్య అని తెలిసి చిరునవ్వులతో ఏవేవో కనుసైగలు చేసే రాజేష్. పాతివ్రత్యం గురించి మాట్లాడుతున్నాడు. అన్నా– చెల్లెలు సెంటిమెంటు మాట్లాడుతున్నాడు.

అటువంటి సనాతన భావాలు గల అతన్ని తను ఆదర్శ పురుషుడు అనుకుంది. అటువంటి మేకవన్నె పులి మీదా వ్యామోహంతోనా తను ఇంత రాత్రి ఆవేశంగా కోర్కెగా అతని గదికి వచ్చింది... అతని మాటల్లోనే చెప్పాలంటే తెగించి... బరి తెగించి...రోడ్డున పడిం... ఎంగిలి విస్త... కుక్క... ఛ... ఛ...

అరుణ తల గిర్రున తిరిగినట్టు అయ్యింది.

కళ్ళు తిరిగి శరీరం తూలిపోతున్నట్టు అవుతుంటే గట్టిగా గోడని పట్టుకుంది.




తను ఎంత తొందర పాటు పనిచేసింది. ఆవేశం ఎంత అనర్ధదాయకం?

అరుణ వేగంగా దూకుతున్నట్టు మేడ మెట్లు దిగి ఇంట్లోకి వచ్చేసింది.

గదిలో నేలమీద ఆ పుస్తకం.. పేజి పేజికి అతి శృంగారంతో వెర్రి ఎక్కించే బూతు పుస్తకం. ఖజురాహో.. అజంత.. ఎల్లోరా...లాంటి శృంగార భంగిమల శిల్పాలు బొమ్మలతో కామ పిశాచాల్ని సైతం మతిపోగొట్టి వెర్రి ఎక్కించే కథల పుస్తకం.

ఆ పుస్తకం చూస్తేనే అరుణలో ఆవేశం పొంగింది.

'వెన్నెల వేడి' 'ఈ వెధవ కథ చదివాక కదూ తనకి చిత్తచాంపల్యం కలిగింది. తన మనసు వికారం అయ్యింది. అందుకే మంచి పుస్తకాలు మంచి సాహిత్యం చదవాలంటారు. తను చౌకబారు శృంగార కథల పుస్తకం చదివింది. అందుకే తన బుద్ధి ఒంకర అయ్యింది ఛీ...'

ఆవేశంగా ఆ పుస్తకం అందుకుని కసిగా పరపరా చింపి పేజిపేజీ ముక్కలు ముక్కలుగా చేసి నేలమీద కుప్పగా పోసింది. అగ్గిపుల్ల గీసి ముట్టించింది. భగ్గుమని మంటలు ప్రజ్వరిల్లసాగాయి. కొద్ది సేపటి క్రితం ఎంతో ఆనందంలో ముంచి శరీరంలో కోర్కెలు రగిలించి అనుభూతుల్లో ముంచెత్తిన ఆ పుస్తకం క్షణంలో ఎర్రగా మంటలు చిమ్ముతూ బూడిద కుప్పగా రాలిసాగింది.

ఆ మంటల్లాగే అరుణ మనసులో కోర్కెలు వికృతపు వాంఛలు కూడా కాలి బూడిద అవుతున్నట్టు మనసు అగ్ని పునీతం అవుతున్నట్టు ఏదో ప్రశాంతత. ఏదో హాయి అనిపిస్తుంటే ఆనందంగా కాలుతున్న ఆ పుస్తకం కేసి చూస్తూ వుండిపోయింది.

'వ్యసనపరుడైన తన భర్తని మార్చుకునే లాంటి ఉపాయాలు చిట్కాలు నేర్పే పుస్తకాలు ఏవన్నా వుంటే రేపు బజారుకెళ్ళి తెచ్చుకోవాలి. తన భర్తని ఎలాగైనా మార్చుకోవాలి. ఓర్పు, సహనం, పట్టుదల వుంటే కానిపనులు వుంటాయా?' అనుకుంటూ మంచంలో వాలి కళ్ళు మూసుకుంది అరుణ.

'అరుణా! నీ మనసుని మభ్యపెడుతున్నావు గాని నీ తాగుబోతు భర్త మారతాడా? నువ్వు సుఖపడేదెప్పుడు?' మనసు ప్రశ్నించింది.

అరుణ పెదవులు అస్పష్టంగా జవాబు చెప్పాయి.

'ఏమో!'